# బ్రహ్మముడి

- చిట్టిపెద్ది ఉమ

హాలంతా గోలగోలగా సందడిగా ఉంది. ఉండదూ మరి... రెండిళ్ల వాళ్ళు ఓ పదిమంది కలసి ఓ చిన్న హాల్లో గజిబిజిగా మాట్లాడుకుంటుంటే.

"అదిగో సుబ్బిగాడొచ్చాడు" నాంచారమ్మ ఆనందంగా అరిచింది. అసలే అదో లోకంలో వున్నట్లు పరధ్యానంగా ఉన్న సుబ్బారావుకి మామ్మ అరుపు తీతువుపిట్ట అరిచినట్లు అపశకునంలా అనిపించింది.

"పెళ్లి ముహూర్తం పెడుతున్నామురా సుబ్బీ" నాంచారమ్మ బోసి నోరు కన్పించేలా నవ్వుతూ అంది.

'ఛీ...ఛీ... పెట్టడానికి ఈ పెద్దాళ్లకి ఇంతకంటే దిక్కుమాలిన పేరు ఇంకోటి తట్టలేదా? సుబ్బారావు అన్న పేరు తన పర్సనాలిటీకి, ఈ కాలానికి తగదు అన్న జ్ఞానోదయం అయ్యేటప్పటికి సుబ్బారావు ఎస్ఎస్‌సి, ఇంటర్ రెండూ దాటేసాడు. ఆ తరువాత సుబ్బారావు చదువూ మూలపడింది. తాతలు, ముత్తాతలు సంపాదించి పెట్టిపోయిన తోటలు, పొలాలు చూసుకుంటున్నాడు. కష్టపడి పేరు మార్చుకున్నా ఇంకా ఆ పేరు తనను వదలదని అర్థమైపోయిన సుబ్బారావు రాజీ పడిపోయి దాన్ని ఇంటి పేరుతో కలిపి ఎస్.ఎస్.రావుగా మార్చేసుకున్నాడు. అయితే చిన్నప్పటి నుంచీ సుబ్బారావుతోనే చదివిన ఆకతాయి మిత్రులంతా ఆ పేరుని తెలుగులోకి అతి తెలివిగా అనువదించి సూ.సూ.రావుగా మార్చి పిలవడం మొదలుపెట్టారు. పొయ్యి మీదనుంచి పెనంలో పడ్డట్టయింది సుబ్బారావు పరిస్థితి.

పెళ్లీడుకొచ్చాడని కూడా చూడకుండా అందరి ముందూ 'సుబ్బీ' అని పిలుస్తున్న నానమ్మని నమిలి మింగెయ్యాలనిపించింది సుబ్బారావుకి.

"ఎవరికి?" అరిచాననుకున్నాడు సుబ్బారావు.

"నాకూ" భళ్ళున నవ్వింది నాంచారమ్మ.

"నీ పెళ్లి నీ ఇష్టం. నన్నెందుకు అడగడం?" సుబ్బారావు చిటపటలాడుతూ హాల్లోంచి తన గదిలోకి వెళ్లిపోయాడు.

"అల్లరి భడవ" నాంచారమ్మ బోడిగుండు మీదకి పంచె లాక్కుంటూ సిగ్గుపడింది.

"ఉరేయ్ సుబ్బూ... ఇలారా ఎక్కడికెళ్తున్నావు? మావయ్య ఈ నెలాఖరులో పెళ్లి ముహూర్తం పెట్టుకుందామంటున్నాడు. నీకేం అభ్యంతరం లేదుగా?"

"అభ్యంతరమే. నేను చేసుకోను" ఖరాఖండిగా అన్నాడు సుబ్బారావు.

హాల్లో వున్న ఆడవాళ్ళు, మగవాళ్లు, పిల్లాజెల్లా అందరూ ఒక్కసారిగా విస్తుపోయారు. సీతకీ, సుబ్బారావుకీ పెళ్లి చెయ్యాలన్నది సీత పుట్టిననాడే నిర్ణయమైపోయింది. సుబ్బారావుకి సీత అత్త కూతురే. చిన్నప్పటి నుంచీ అందరూ అనుకుంటున్నదే. సుబ్బారావుకీ సీతంటే ఇష్టమే. సుబ్బారావు సీతతో చాటుమాటుగా ఆడే సరసాలే దానికి సాక్ష్యం. అక్కడే ఓ మూల చెల్లెలు లక్ష్మితో కబుర్లాడుతున్న సీత కళ్లల్లో సునామీలు పొంగి పొర్లుతోంది.

"ఎందుకని?" సుబ్బారావు పితాశ్రీ నరసింహం ఉగ్ర నరసింహావతారం ఎత్తుతూ అడిగాడు.. కాదు అరిచాడు.

"చేసుకోను అంటే ఇప్పుడే చేసుకోను. అస్సలు చేసుకోనని అర్థం కాదు. నేను రచయితనయ్యాకే పెళ్లి"

సీత 'అమ్మయ్య' అని ఊపిరి పీల్చుకుంది. అశ్రుధారలకి ఆనకట్ట పడింది. అక్కడే కూర్చున్న సీత అన్నయ్య బోసు కిసుక్కున నవ్వాడు.

"అదేంటి కాబోయే బావయ్యా... ఎవరైనా ఉద్యోగస్తుడయ్యేదాకా పెళ్లి చేసుకోనంటారు. కాస్తో కూస్తో సంపాదించేవరకూ పెళ్లి చేసుకోనంటారు. కానీ ఇదేంటి..."

"పోనీ అప్పుడే చేసుకుందువుగానీ.. రచయితవి ఎప్పుడవుతావో చెప్పు" పరంధామయ్య పరమానందంగా అడిగాడు.

"నేనేమైనా జ్యోతిష్కుడినా? నా నవల అచ్చయినప్పుడు అవుతాను"

"అన్నప్రాసననాడే ఆవకాయ" బోసు తెరచిన నోరు మూసుకోవాలన్న స్పృహ కూడా లేకుండా ఆశ్చర్యపోయాడు.

"రాయడం మొదలుపెట్టేసాను" సుబ్బారావు కొంచెం గర్వంగా తల ఎగరేసి అన్నాడు.

"బావా! నీకీ పిచ్చి ఎప్పట్నుంచి?" లక్ష్మి చెల్లెలు జ్యోతి జాలిగా చూసింది సుబ్బారావువైపు.

"నేను బతికుండగా అది అవుతుందట్రా" నాంచారమ్మ ఆరా తీసింది.

"ఏది పెళ్లా నానమ్మా" సీత ఎంక్వయిరీ చేసింది.

సుబ్బు, సుబ్బిగా, సుబ్బయ్య అన్న పేర్లతో పిలవబడే సుబ్బారావు తన పేరుకి పేరు తేవాలని కంకణం కట్టుకున్నాడు. ఎలా పేరు తెచ్చుకోవాలా అన్నది ఆలోచించి ఆలోచించి చివరికి చిన్నప్పటి నుంచీ కనిపించిన ప్రతి మ్యేగజైనూ, ప్రతి పత్రికా, డిటెక్టివ్ నవలలూ చదివిన జ్ఞానంతో రచయిత మార్గం ఎన్నుకున్నాడు.

"బావా! సుబ్బారావు అన్న పేరుకి మంచి పేరే వుంది. గౌరవం ఉంది. మన రాయప్రోలు, నండూరి, ఇంకా ఎందరో లాయర్లు, డాక్టర్లు, దర్శకులు ఆదుర్తి... ఇలా అందరూ ఆ పేరుగలవాళ్లే. నువ్వంత సిగ్గు పడిపోవాల్సింది ఏం లేదు ఆ పేరు ఉన్నందుకు."

"ఏమైనా సరే నేను రచయితనయ్యాకనే పెళ్లి" సుబ్బారావు తన మాటకి తిరుగులేదు అన్నట్లు ఖచ్చితంగా అన్నాడు.

"సరేకానీ... నవల పేరేంటి? కథతో మొదలుపెట్టు. చదువు అ,ఆలతో మొదలవుతుంది కానీ అం, అఃలతో కాదు"

ఏమనుకున్నాడో సుబ్బారావుకి బోసు మాటల్లో నిజం ఉందనిపించింది. నవల ఆలోచన పక్కనపెట్టి కథలమీద పడ్డాడు. అరడజను కథలు రాసి అన్ని పత్రికలకూ పంపాడు. అన్ని కథలూ సుబ్బారావుమీద దిగులుతో వెనక్కి వచ్చేసాయి. అలాక్కాదని బాగా ఆలోచించి ఆంధ్ర దేశంలో ఉన్న వార, మాస పత్రికలకు ఒక్కొక్క చోట నాలుగు కథలు ఉండేటట్లు రాసి పోస్టు చేసాడు నాలుగింటిలో ఒక్కటైనా పడకపోతుందా అని. ఒక్క కథ చాలు సుబ్బారావుకి రచయిత అనిపించుకోవడానికి, తన పంతం నెగ్గించుకోవడానికి. ఇన్ని మ్యేగజైన్లు... ఒక్క కథ కానీ... ఊహూ... ఒక్కో కథ వరుసపెట్టి గొలుసు కథల్లా లైన్‌గా వెనక్కి రావడం మొదలుపెట్టాయి.

"బావా! నేనింక వెయిట్ చేయలేను. నీ సుబ్బ

ప్రతిజ్ఞ పక్కనపెట్టి పెళ్లికి రెడీకా'' జ్యోతి అల్టిమేటమ్ ఇస్తున్నట్లుగా ఉంది.

"సుబ్బ ప్రతిజ్ఞ ఏమిటి'' లక్ష్మి ఆశ్చర్యపోయింది.

"భీష్ముడు చేసింది భీష్మ ప్రతిజ్ఞ అయితే సుబ్బారావు చేసింది మరి సుబ్బారావు ప్రతిజ్ఞేగా... సుబ్బారావు ప్రతిజ్ఞ అనేది మరీ పొడుగ్గా వుందని, రిథమ్ కుదరలేదని...'' జ్యోతి ఎక్స్‌ప్లెయిన్ చేసింది.

"జ్యోతీ! అక్కని అని కూడా చూడకుండా బావకే లైనేస్తున్నావా'' సీత కంఠం రుద్ధమయింది.

"పిచ్చి అక్కా! బావకి నేను లైన్ వేయడంలేదు. నా లైన్ క్లియర్ చేసుకుంటున్నా. మీ పెళ్లయితేగానీ బోసుకీ, లక్ష్మికి పెళ్లికాదు. నా పెళ్లి కాదు. ఆర్నెల్లయిందా బావ ప్రతిజ్ఞ చేసి... నీ పెళ్లి ఎప్పుడవుతుందో... ఆ తరువాత నా పెళ్లి ఎప్పుడవుతుందో'' జ్యోతి విచారంగా అంది.

"దీనికెప్పుడూ పెళ్లి గోలే'' లక్ష్మి మూతి తిప్పుతూ అంది.

"ఎవరికి తొందరగా ఉంటే వాళ్ళు పెళ్లిళ్లు చేసుకోవచ్చు. నా పెళ్లి కోసం ఎవరూ ఆగనక్కర్లేదు'' సుబ్బారావు తన ఉదారతని ప్రదర్శించాడు.

"నేను కూడానా?'' సీత కొంటెగా అడిగింది.

"నువ్వు చేసుకోమన్నా మీ పెళ్లయితేగానీ మా పెళ్లిళ్లు చేయడానికి పెద్దవాళ్ళు ఒప్పుకోవద్దూ'' జ్యోతి సాగదీసింది. "బావా...బావా ప్లీజ్ నీ ఒట్టు తీసి గట్టుమీద పెట్టు'' గడ్డం పట్టుకోకుండానే బతిమాలింది జ్యోతి సుబ్బారావుని.


"మామయ్య ఆర్నెల్లు టైమిచ్చాడు. ఆర్నెల్లకి ఇంకా ఆరువారాలు ఉంది. ఆ తరువాత కథ పడ్డా, పడకపోయినా అక్షింతలు పడక తప్పదు'' బోసు భరోసాగా అన్నాడు.

"అదేంకాదు. నా పేరు అచ్చులో చూసుకునేవరకు పెళ్లి ప్రసక్తిలేదు'' సుబ్బారావు తన మాట మీద నిలబడుతూ అన్నాడు.

"అయితే అరడజను ఉత్తరాలు రాసివ్వు. స్వయంగా నేను పత్రికా ఆఫీసుకు వెళ్లి నీ పేరు పడేలా చూస్తాను'' అన్నాడు జ్యోతికి లైనేస్తున్న సుబ్బారావు ఫ్రెండు శ్రీహరి.

సుబ్బారావు, శ్రీహరివైపు గుర్రుగా చూసాడు 'ఛీ...మిత్రద్రోహి' అన్నట్లు.

"పోనీ నాన్న ఫార్ములా ఒప్పుకో బావా'' బోసు ముసిముసి నవ్వులు దాచుకుంటూ అన్నాడు.



"అదేం ఫార్ములా" అందరూ బోసువైపు ఆసక్తిగా చూసారు.

"గజలక్ష్మి ప్రింటర్స్ అమ్మకానికి వచ్చిందిట. నష్టమే అయినా నాన్న దాన్ని కొనేసి మన సుబ్బారావు రాసిన తిరిగొచ్చిన నవలలన్నీ ప్రింట్ చేస్తానన్నాడు"

అందరూ పకపకా నవ్వుతుంటే సుబ్బారావుకి తల కొట్టేసినట్టయింది. ఏదో కాలం కలిసిరాక కథ అచ్చవడంలేదు. కానీ మరీ అంత నాసిగా ఏం రాయడం లేదని సుబ్బారావుకి తనమీద నమ్మకం.

"అన్నయ్యా! నీ పేరు, దాంతోపాటు ఫొటో కూడా వచ్చే ఉపాయం ఒకటి ఉంది" సుబ్బారావు ఆఖరి తమ్ముడు ఓరోజు తనవంతు ఉచిత సలహా ఇచ్చాడు.

"ఏంటది?" అందరిలో కుతూహలం.

"కనిపించడంలేదు అని ప్రకటన ఇస్తే సరి"

సుబ్బారావు మొహం చూడలేక, నవ్వు ఆపుకోలేక మొహాలు తిప్పుకుని నవ్వు బిగపెట్టుకున్నారందరూ.


## న్యాయము-చట్టము

1986లో థామస్ డాస్వెల్ అనే అతను పిట్స్‌బర్గ్‌లోని హాస్పిటల్‌లో 48 ఏళ్ళ స్త్రీని రేప్ చేసాడన్న ఆరోపణ మీద 26 ఏళ్ళ శిక్ష విధించారు. శిక్ష పడినప్పుడు అతనికి 25 సంవత్సరాలు. ఇద్దరు పిల్లలున్నారు. ఆ తరువాత మంచి ప్రవర్తనకి పెరోల్‌మీద విడుదల చేయమని నాలుగుసార్లు అప్పీలు చేసుకున్నా అప్పటికీ అతను నేరాన్ని అంగీకరించడంలేదని విడుదల చేయడానికి కోర్టు నిరాకరించింది. ఏకారణం చేతనో అప్పటి ప్రాసిక్యూటర్లు అతనిమీద డిఎన్ఎ టెస్టుకి ఒప్పుకోలేదు. ఇటీవల అతనిమీద డిఎన్ఎ టెస్టు చేసినప్పుడు రేప్‌కు గురైన స్త్రీ నుంచి తీసిన వీర్యపు మరకలతో అతనికి సంబంధం లేదని, అతనిమీద తప్పుగా శిక్ష పడిందని రుజువైంది. 19 ఏళ్ళ శిక్ష తరువాత అతన్ని విడుదల చేసారు. "అందరికీ థాంక్స్. అన్యాయంగా నాకు శిక్ష పడినందుకు నాకెవరిమీదా కోపంలేదు. దేశంలో న్యాయ వ్యవస్థ పని చేస్తోంది. అది చాలు నాకు" అని అన్నాడు.

## టొమేటోనియా

స్పెయిన్‌లో బ్యూనోల్ అనే ఊళ్ళో 1944 నుంచి ప్రతి ఏటా ఆగస్టు ఆఖరివారంలో టొమేటోనియా అనే ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంటుంది. ఇది ప్రపంచంలో అతి పెద్ద ఫుడ్ ఫెస్టివల్‌గా పేరు పొందింది. అక్కడ చేరిన జనాలు రోజంతా టొమేటాలతో ఒకరినొకరు చిత్తుగా కొట్టుకుంటారు. దీనివల్ల ఊరు ఊరంతా టొమేటో రసంతో వరదలా పారుతుంది.

-విమలారామం




"వేళకోళమైపోయింది నా బ్రతుకు" కథ అచ్చేయ్యేవరకూ సాయంత్రాలు వాళ్లతో కలవకూడదన్న నిర్ణయానికి వచ్చేసాడు సుబ్బారావు.

అతని అవస్థ చూడలేక సీత, బోసు, శ్రీహరి, జ్యోతి అందరూ ఒకళ్లకి తెలియకుండా ఒకళ్ళు ఎంతో కష్టపడి కథ రాసి సుబ్బారావు పేరుతో రిటర్న్ పెట్టకుండా పంపించి ఆత్రంగా పోస్ట్‌మేన్ కోసం ఎదురుచూస్తున్నారు. అలాగైనా సుబ్బారావు మాట నిలుస్తుంది, అందరి పెళ్లిళ్లకి తెర లేస్తుంది అని.

***

పది నిముషాలకోసారి పనులని పక్కనపెట్టి ఇంట్లో అందరూ హాల్లో ఉన్న గోడ గడియారం వంక ఆదుర్దాగా చూడడం, 'ఇంకా అరగంట ఉంది' అని నిట్టూర్చడం, 'వెధవ గడియారం స్లో' అని తిట్టుకోడం చూసి 'ఇదేం విచిత్రం' అని కనుబొమలు ముడివేసి ఆలోచనలో పడింది చుట్టపు చూపుగా వచ్చిన అహల్య.

"పన్నెండయిందా?" నాంచారమ్మ లోపలి గదిలోంచి అరిచింది.

"ఇంకా అరగంట ఉంది బామ్మా. నువ్వు కాస్సేపు కునుకు తియ్యి" సీత వసారాలోంచే జవాబుగా అరిచింది.

"నాంచారమ్మ పెద్దమ్మ పావం పక్కమీదనుంచి లేవలేక బాధ పడుతోంది. డాక్టర్ వస్తాడు కాబోలు పన్నెండింటికి" ఎవరినీ అడగకుండానే పన్నెండు గంటల సీక్రెట్ కనిపెట్టేసినందుకు అహల్య తన తెలివితేటలకు తనే మురిసిపోయింది.

"పన్నెండయింది" సీత ఆనందంగా అరిచింది.

చదువుతున్న యండమూరి నవలని పక్కనపెట్టి హాల్లోకి పరుగెత్తుకొచ్చింది లక్ష్మి. సీతదీ, సుబ్బారావుదీ పక్కపక్క ఇళ్లే కావడంతో అందరూ ఇక్కడో అక్కడో గుంపుగా ఉండడం ఆ రెండిళ్ల వాళ్లకి మొదటి నుంచీ వున్న అలవాటే. ఎక్కడినుంచి వచ్చారో బోసు, శ్రీహరి కూడా ఇంటికొచ్చేసారు.

"వచ్చాడా?" బోసు ఆదుర్దాగా అడిగాడు. సీత లేదన్నట్లు తలాడించింది వీధి వంక దృష్టి సారిస్తూ.

"అదిగో వస్తున్నాడు" లక్ష్మి సంబరంగా అరిచింది.

"మంగళహారతి సిద్ధం చేయి" శ్రీహరి వ్యంగ్యంగా అంటూ నవ్వుతుంటే లక్ష్మి మూతి బిగించింది. 'ఎన్నాళ్లు వెక్కిరిస్తావో చూద్దాం' అన్నట్లు కనుబొమ లెగరేసింది. రెండిళ్లవాళ్లూ అరుగుమీద చేరిపోవడంతో అహల్య కూడా 'ఏంటో చోద్యం చూస్తే సరి' అనుకుంటూ బయటకొచ్చింది.

"ఇవ్వాళ పొద్దుట్నుంచీ ఎడమ కన్ను అదురుతోంది వదినా. తప్పకుండా పడుతుంది" సరస్వతి నమ్మకంగా అంది.

సీతకి పెళ్లి ఘడియలు వచ్చేసాయన్నాడు నిన్న రాంభొట్లగారు. పైగా ఇవ్వాళ సప్తమీ పునర్వసు. సుబ్బుకి సాధన తార. ఈసారి తప్పకుండా పడుతుంది. నాకూ నమ్మకంగా ఉంది వదినా" కళ్యాటి ఎగ్జయిటింగ్‌గా అంది. అందరూ ఆత్రుతగా చూస్తుండగా అందరి గుండెలు దడదడలాడుతుండగా ఇంటి ముందున్న అరుగుమీద భళ్లున శబ్దమయ్యేలా పోస్టు పడేసి తుర్రుమన్నాడు పోస్ట్‌మేన్. ఆరునెలల నుంచీ ఆ వీధిలోకి రావాలంటే అతనికి హడల్‌గా ఉంది. పోస్ట్ సమంగా తేవడంలేదని, అసలు ఊళ్లోంచి పోస్ట్ సమంగా పంపడంలేదని ఎన్నెన్ని అనుమానాలో, ఆరాలో. పన్నెండవుతుందంటే పోస్ట్‌మేన్‌కీ దడగానే ఉంటోంది. యక్ష ప్రశ్నలకి జవాబు చెప్పలేక హడిలిపోతున్నాడు.

"పడిందా?" నాంచారమ్మ లోపలినుంచీ ఆదుర్దాగా అడిగింది. లేవడానికి ఓపిక లేకపోయినా ఆవిడ కంఠం మాత్రం కంచులా మోగింది వీధి బయటివరకూ.

"ఆ పడింది... ఇంటి ముందర" శ్రీహరికి నవ్వులాటగా ఉంది.

తిరిగొచ్చిన కథ ఫైలుని నిస్తేజంగా, నిర్లిప్తంగా చూసారు అందరూ.

"పోస్ట్ వచ్చేసిందా" సుబ్బారావు ఆఘమేఘాలమీద వస్తున్నట్లు వచ్చి సడెన్ బ్రేక్ వేసాడు బైక్‌కి. అనాధ శవంలా అరుగుమీద పడివున్న తన కథని

చేతిలోకి తీసుకున్నాడు మెల్లగా. మాట్లాడకుండా లోపలకు వెళ్లిపోతున్న సుబ్బారావు వంక జాలిగా చూసారు అందరూ. గడువు తీరిపోయింది అంటూ నరసింహం ముహూర్తం పెట్టించేసాడు. ఒట్లు, ప్రతిజ్ఞలు పక్కన పెట్టమని హుంకరిస్తూ సుబ్బారావు తన ప్రతిజ్ఞ నిలబెట్టుకోవడం కోసం ఇంట్లోంచి పారి పోడు కదా. అందరిలో అనుమానాలు. రాత్రీ పగలూ సుబ్బారావుకి తెలియ కుండానే కాపలా కాయడం మొదలుపెట్టారు.

★★★

అయితే ఇంక పెళ్లి వారం రోజులుందనగా అందర్నీ నిశ్చింతకి గురి చేస్తూ సుబ్బారావు కథని ఎంపిక చేసామని ఓ పత్రిక నుంచి ఇన్‌ఫర్మేషన్ వచ్చింది. ఇంట్లో నిజమైన పెళ్లి సందడి మొదలైంది. సుబ్బారావులో కొత్త కళ వచ్చింది. 'బ్రహ్మముడి' అన్న టైటిల్‌తో తనేం కథ రాయలేదని సుబ్బారావుకి మన స్సులో ఏ మూలో పీకుతున్నా తను రాసిన నలభై కథల్లో ఏదో ఒకటి అయి వుంటుంది. బహుశా కథ పేరు పత్రిక వాళ్ళు మార్చారేమో అని సరిపెట్టుకు న్నాడు. రచయిత సుబ్బారావు పెళ్లి వైభవంగా సీతతో జరిగిపోయింది. సీతా, సుబ్బారావు హనీమూన్ కోసం సిమ్లా, మనాలి వెళ్లి వచ్చారు. ఆ బ్యాక్‌గ్రౌం డ్‌లో రెండు కథలు రాసి పారేసాడు. 'బ్రహ్మముడి' కథ పడ్డ పత్రిక మార్కెట్ లోకి వచ్చింది. తన కథని తనివితీరా చదివి ఆనందించాలనుకున్న సుబ్బారా వుకి షాక్...

ఇంటి పేరు, అసలు పేరుతో కలిపి అది సుబ్బారావు పేరే కానీ కథ మాత్రం సుబ్బారావు రాయలేదు. ఇంట్లో అందరూ పత్రిక లాక్కుని చకచకా చదివేసి కథ చాలా బాగుందని సుబ్బారావును కంగ్రాట్స్ చేస్తుంటే సుబ్బారావు వెర్రిగా నవ్వుతూ థాంక్స్ చెప్పాడు.

1930లో విచిత్రమైన పరిస్థితుల్లో జరిగిన ఓ పెళ్లి కథ 'బ్రహ్మముడి'. సుబ్బారావు పరిస్థితి మింగలేడు, కక్కలేడు అన్నట్లు తయారయింది. బ్రహ్మ ముడి పడ్డ వేళావిశేషం సుబ్బారావు రాసిన ఇంకో మూడు కథలు వివిధ పత్రి కల్లో అచ్చయ్యాయి. సుబ్బారావు రెగ్యులర్‌గా కథలు రాస్తూ రచయిత అని పించుకున్నాడు. అయినా మనస్సులో ఓ వెలితి. తన మొదటి కథ బ్రహ్మముడి చిక్కువీడని రహస్యమే సుబ్బారావుకి. అది తన పేరుతో ఎవరు రాసి ఉంటారు అన్నది సమాధానంలేని ఓ ప్రశ్న.

★★★

"అమ్మ సుబ్బారావు కోసం తెగ కలవరిస్తోంది. ఓసారి వాడినీ, సీతనీ పంపించు" నరసింహం తమ్ముడు కోయంబత్తూరునుంచి ఉత్తరం రాసాడు.

నాంచారమ్మ సుబ్బారావు పెళ్లి కాగానే చిన్న కొడుకుతో కోయంబత్తూ రుకు వెళ్లింది. కొత్తగా పెళ్లయిన మనవడినీ, మనవరాలినీ తనతో కొన్నాళ్ళు ఉంచుకోవాలన్నది ఆమె కోరిక. సీతా, సుబ్బారావు ఓ నెల తరువాత దసరా పండుగకి కోయంబత్తూరు వెళ్లారు.

సీతా, సుబ్బారావు వెళ్లేసరికి నాంచారమ్మ హాస్పిటల్‌లో వుంది. ఆస్మా ఎక్కువై ఊపిరి ఆడక అవస్థ పడుతుంటే ఆమెను హాస్పిటల్‌లో చేర్చారు. ఆక్సి జన్ ఎక్కించారు. సీతనీ, సుబ్బారావునీ గుర్తించే స్థితిలోగానీ, మాట్లాడే స్థితిలో గానీ లేదు నాంచారమ్మ.

మూడురోజుల తరువాత కళ్ళు విప్పిన నాంచారమ్మ తన మంచం దగ్గర కూర్చున్న సుబ్బారావుని చూసి చిన్నగా నవ్వింది.


"మామ్మా" సుబ్బారావు ఆనందంగా పిలిచాడు. "ఎలా ఉంది మామ్మా. నీకోసం నేను అంత దూరం నుంచి వస్తే నువ్విలా కళ్లు మూసుకుని ఒళ్ళు తెలియకుండా పడిపోవడం ఏమన్నా బాగుందా? మామ్మా! నీకు తెలుసా నా కథలు ఒకటి కాదు నాలుగు అచ్చయ్యాయి తెలుసా" సుబ్బారావు ఆనం దంగా చెప్పుకుపోతున్నాడు. నాంచారమ్మ పెదవుల మీద వల్చటి నవ్వు. సుబ్బారావుకి చాలా సంతోషంగా ఉంది మామ్మ మళ్లీ మనుష్యుల్లో పడిందని. నాంచారమ్మ తలాడించింది దగ్గరకు రమ్మన్నట్లు.

సుబ్బారావు నాంచారమ్మ మొహం దగ్గర తన మొహం పెట్టి "ఏం కావాలి మామ్మా. డాక్టర్ని పిలవనా?"

నాంచారమ్మ పెదవులు అస్పష్టంగా కదిలాయి. "బ్రహ్మముడి విప్పలేకపో యావు కదూ" నాంచారమ్మ ఆయాసంతో పలికి ఇక మాట్లాడలేనట్లు కళ్ళు మూసేసుకుంది. సుబ్బారావు డాక్టర్నీ, నర్స్‌ని పిలవడానికి బయటకి పరుగె త్తాడు. వాళ్లు వచ్చేసరికి నాంచారమ్మ ప్రాణాలు అనంత వాయువుల్లో కలసిపో యాయి.

సుబ్బారావుకి చివరి క్షణాల్లో నాంచారమ్మ పలికిన పదాలు అర్థమవసా గింది. 'బ్రహ్మముడి అంటే.... ఆ కథ మామ్మ రాసిందా?' సుబ్బారావు మనస్సు తనని రచయితగా నిలబెట్టిన మామ్మపట్ల కృతజ్ఞతతో నిండిపోగా కళ్ళు శ్రావణమేఘాలయ్యాయి.

★



## చిత్రవిచిత్రం

కొన్ని సినిమాల పేర్లు విచిత్రంగా ఉంటాయి. 'వర్షం' చిత్రంలో 'నువ్వొ స్తానంటే నేనొద్దంటానా?' పాటని చిత్రంగా రూపొందించి హిట్ కొడితే ఇప్పుడు మహేష్‌బాబు బ్లాక్‌బస్టర్ 'ఒక్కడు' చిత్రంలోని 'హరేరామ హరే కృష్ణ' సాంగ్‌నే చిత్రానికి పెడుతున్నారు. ఈ చిత్రానికి త్రివిక్రమ్ శ్రీనివాస్ కథనందిస్తున్నారు. ప్రభాస్ చిత్రం 'పౌర్ణమి' తర్వాత ఈ చిత్రాన్ని ప్రారం భిస్తారని సినీవర్గాలు చెబుతున్నాయి.

